# ఆంధ్రుల చరిత్ర - సంస్కృతి :
# ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పరిశోధనలు

ఆచార్య కె. వి. ఆర్. నరసింహం

ఆంధ్ర విశ్వకళాపరిషత్తు ప్రచురణ

# ఆంధ్రుల చరిత్ర - సంస్కృతి :
# ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పరిశోధనలు

ఆచార్య కె. వి. ఆర్. నరసింహం

ఆంధ్ర విశ్వకళాపరిషత్తు ప్రచురణ

కాపీలు 1,000 ఏప్రిల్ 1975

© ఆంధ్రా యూనివర్సిటీ

సీరీస్ నెంబరు 123

వెల : ఒకరూపాయి

ప్రతులకు :

డైరెక్టర్
ఆంధ్రా యూనివర్సిటీ ప్రెస్ అండ్ పబ్లికేషన్స్
ఆంధ్రా యూనివర్సిటీ కేంపస్
వాల్తేరు, విశాఖపట్టణం 530 003

ముద్రణ : ఆంధ్రా యూనివర్సిటీ ప్రెస్సు, వాల్తేరు

# విషయ సూచిక


పుట

1. ఆంధ్రుల చరిత్ర – సంస్కృతి (5–18)
సాంస్కృతిక చరిత్ర – సాధన సామగ్రి 8
ఆంధ్రుల చరిత్ర 9
తూర్పు చాళుక్యులు (క్రీ.శ. 625–1077–1118) 11
వెలనాటి చోడులు – తెలుగు చోడవంశాలు (క్రీ.శ. 1108–1206) 11
కాకతీయులు (క్రీ.శ. 1000–1323) 11
రెడ్డి రాజులు (క్రీ.శ. 1324–1424–1430) ; వెలమరాజులు (క్రీ.శ. 1330–1430) 12
విజయనగర సామ్రాజ్యం (క్రీ.శ. 1336–1565) 12
సంస్థానములు 13
అధునికయుగం – ఆంధ్ర సంస్కృతి (క్రీ.శ. 1800 నుండి) 13
ఆంధ్రప్రదేశ్ అవతరణ 14
ఆంధ్రుల సంస్కృతి – మతం 15
వాస్తు శిల్పములు, చిత్రలేఖనము 16
సంగీత నాట్యాలు 16
సారస్వతం 17
ఆటలు–వేడుకలు–వినోదాలు 17
ఆంధ్రదేశ చరిత్రకారులు 18

2. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పరిశోధనలు (19–32)
ఆంధ్ర శాఖ 19
తత్త్వశాఖ 25
సంస్కృత శాఖ 26
మానవశాస్త్ర శాఖ 26
చరిత్ర శాఖ 27
హిందీ శాఖ 31

# గ్రంథకర్త కృతజ్ఞతలు

ఈ వ్యాసరచనకు నాకు అవకాశం కల్పించిన ఆంధ్రవిశ్వకళాపరిషదుప కులపతులు శ్రీ రాజా రంగయ్యాప్పారావుగారికి నా హార్దిక కృతజ్ఞతను వ్యక్తం చేసుకుంటున్నాను.

ఈ వ్యాసరచనకు నాకు కావలసిన పుస్తకాల్ని తెచ్చి యివ్వడమే కాకుండా విశ్వవిద్యాలయంలోని వివిధశాఖలవారి పరిశోధన విషయాల్ని సేకరించి యిచ్చిన డా. ఎమ్. వి. సత్యనారాయణగారికీ, మాతో అన్నివిధాలా సహకరించిన యితర శాఖలవారికీ, అత్యల్పవ్యవధిలోనే ముద్రణ కార్యక్రమాన్ని నిర్వర్తించిన ఆంధ్ర విశ్వవిద్యాలయ ముద్రణాలయ పర్యవేక్షకులు డా. సి. బొర్రేశ్వరరావుగారికీ నా హృదయపూర్వకమైన కృతజ్ఞత తెలుపుకుంటున్నాను.

# ఆంధ్రుల చరిత్ర - సంస్కృతి

ఆంధ్రదేశ చరిత్రలో, ఈ సంవత్సరం (1975), స్వర్ణాక్షరాలతో వ్రాయదగినది. ఆంధ్ర రాష్ట్రం అవతరించిన తరువాత ఇన్నాళ్లకు మనం ప్రపంచ తెలుగు మహాసభలు జరుపుకుంటున్నాం. ఆంధ్రరాష్ట్రంలోనే కాకుండా, ఆంధ్రేతర రాష్ట్రాలలోకూడా ఉన్నటువంటి ఆంధ్రులందరూ, ఒకచోట సమావేశమయి, వివిధాంశాల్ని గురించి చర్చించుకోవడానికి తగిన అవకాశం ఇన్నాళ్లకు లభించింది. వివిధ దేశాలనుండి వచ్చిన ప్రతినిధులు కూడా ఇందులో పాల్గొనడం హర్షదాయకమైన విషయం. అంతర్విశ్వవిద్యాలయ సాంస్కృతికోత్సవం కూడా ఇప్పుడే నిర్వహింపబడడం, తెలుగువారి వివేచనాశక్తికీ, ఔచితీపరిపోషణ సామర్థ్యానికి ప్రబల నిదర్శనం. ఈ శుభసమయంలో మనం మన చరిత్రనీ, పరంపరాగతమైన మన సంస్కృతినీ వెలుగులోనికి తెచ్చిన విద్వాంసుల్ని స్మరించడం సమంజసమే కాదు, అత్యావశ్యకం కూడా. ఆంధ్రుల చరిత్ర, సంస్కృతి అనే విషయాలమీద పూర్వం కృషిచేసిన మహనీయులు అనేకులు ఉన్నారు. ఇప్పుడు మన విశ్వకళాపరిషత్తులో వివిధశాఖలకు చెందిన విద్వాంసు లనేకులు, ఈ అంశాలపై ప్రశంసనీయమైన కృషిచేస్తున్నారు. అన్నిరంగాలలోవలెనే, ఈ చారిత్రక సాంస్కృతిక రంగంలోను, ఆంధ్ర విశ్వకళా పరిషదధ్యాపకులు బహుముఖాల పరిశోధనలుచేసి అత్యపూర్వములైన సత్ఫలితాలను సాధించి ఉన్నారు. వాటిని గుర్తుచేసుకోవలసిన అవశ్యకత మనకెంతైనా ఉన్నది. ఈలాగున ఒకమారు సింహావలోకనం చేసుకున్నందువల్ల, చారిత్రక సాంస్కృతిక రంగంలో ఇప్పటికి జరిగిన పరిశోధన ఎంతో, జరుపవలసిన పరిశోధన ఎంతో, మనకు స్పష్టంగా తెలుస్తుంది. విద్యాపురోగతికి ఇటువంటి సమీక్ష అత్యావశ్యకం.

ఈ పరిశోధనల్ని వివరించడానికి పూర్వం దేశ చరిత్రకి, సాంస్కృతిక చరిత్రకి గల సంబంధభేదాల్ని స్పష్టీకరించవలసి ఉన్నది. నేటి విద్యావిధానంవల్ల మనకు సంక్రమించిన సత్ఫలితాల్లో చరిత్రాధ్యయనం ఒకటి. మన జాతికి మహోజ్జ్వలమైన చరిత్రఉన్నది. కాని దాని పరిరక్షణ విషయంలో మన పూర్వులు శ్రద్ధచూపెట్టలేదన్నమాట వాస్తవం. దాన్ని కాదన్నందువల్ల మనకుగాని, వారికిగాని వచ్చే గౌరవలాభాలు ఏమీలేవు. అక్కడక్కడ ఛిన్నాభిన్నంగా, అస్తవ్యస్తంగా పడిఉన్న శాసనాలు, కైఫీయతులు, రాజవంశావళులు మొదలైన ఆధారాలను క్రోడీకరించి క్రమపద్ధతిలో సమీక్షించి మనదేశ చరిత్ర వ్రాసిన కీర్తి ఆధునికులకే దక్కింది. ఈలాగు అనడంవల్ల ఈ నగ్నసత్యాన్ని అంగీకరించినందువల్ల మన పూర్వుల ఖ్యాతికి యద్విధమైన కళంకము రాదు. వారు చరిత్ర ప్రాధాన్యాన్ని గుర్తించలేదు. అందుకే

సక్రమంగా దాన్ని వ్రాయడానికి ఏనాడును ప్రయత్నించలేదు. ఇక్కడ మనం ఒక ముఖ్యవిషయాన్ని గమనించవలసి ఉన్నది. నేటికికూడా మనకు నిర్దుష్టము, నిష్పాక్షికము, సమగ్రము అయిన చరిత్ర లభించలేదనే చెప్పాలి. అటువంటి చరిత్ర రావాలంటే, మనవారి కృషి ఇంకా తీవ్రతరం కావాలి. దేశ చరిత్రను నిరసించి మాటాడే విమర్శకులు లేకపోలేదు. రాజుల జైత్రయాత్రలు, వారు సాధించిన విజయాలు, వానివల్ల జరిగిన రక్తపాతాలు, కుట్రలు, కుతంత్రాలు, దారుణ మారణ హోమాలు తప్ప దేశ చరిత్రలో ఏమున్నది? అని వారి యీసడింపు. కాని, ఈ విమర్శలు అపాత రమణీయాలు, అవిచారమూలకాలు అని చెప్పడానికి నేను వెనుకాడను. ప్రయోజనాన్నిబట్టి రచనా విధానం మారుతుంది. వారు వ్రాసినది దేశ చరిత్రగాని, సాంస్కృతిక చరిత్రకాదు. ఆనాడు దేశంయొక్క బాగోగులన్ని రాజులమీద ఆధారపడి ఉండేవి. ఈనాటి ప్రజలలో ఉన్న రాజకీయ చైతన్యం ఆనాటి ప్రజలలోలేదు. రాజు రాజ్యానికి మూలస్తంభం. అతని సైనికబలంమీద, యుద్ధతంత్ర నైపుణ్యంమీద, చతురుపాయ చతురతమీద దేశాభ్యుదయం ఆధారపడి ఉండేది. ఇంతెందుకు, రాజుంటేనే సైనికులు యుద్ధం చేసేవారు. అతడు మరణిస్తే అతిబల మహాబలులైన సేనాధిపతులుకూడా, నిరుత్సాహంతో నీరుగారి పోయేవారు. అటువంటి పరిస్థితిలో చరిత్రకారుడు రాజునిగురించి కాకపోతే మరెవరిని గురించి వ్రాస్తాడు? ఇంతకు, దేశమంతటికి సంబంధించిన ముఖ్యపరిణామాల్ని వివరించడం చరిత్రకారుని ధ్యేయం. ఆ ప్రయోజనం సాధింపబడిందా? లేదా? అన్నదే మనం పరిశీలించవలసిన విషయం. అతనిధ్యేయం కానిదాన్ని, అతని ప్రణాళికలో లేనిదాన్ని అతడు సాధించలేదని నిరసించడం అసమంజసం. దేశ చరిత్ర రాజనాయకమైనది. సామూహికంగావచ్చే పెద్దమార్పులను మాత్రమే అది వివరిస్తుంది. రాజ్యాంగవిధానాన్ని స్థూలంగా నిరూపిస్తుంది. దైనందిన ప్రజాజీవితాన్ని వ్యక్తీకరించదు.

మన తాతముత్తాతలు ఎలా బ్రతికేవారు? వారి మత విశ్వాసాలు, ఆచార వ్యవహారాలు, వినోద కార్యక్రమాలు ఎటువంటివి? వారు ఎటువంటి ఉడుపులంటే మోజు పడేవారు? స్త్రీలు నోచే నోములు, ధరించే ఆభరణాలు, పాడే పాటలు, ఆడే ఆటలు ఎటువంటివి? శిల్ప చిత్రలేఖన నాట్యాది కళలలో పూర్వులు సాధించిన ప్రగతి ఎటువంటిది? అందు వారు చేసిన కృషి ప్రశంసనీయమేనా? — ఇటువంటి ప్రశ్నలకి సమాధానం కావాలంటే, మనం సాంస్కృతిక చరిత్రవంక మన దృష్టిని కేంద్రీకరించవలసి ఉంటుంది. ఒక జాతిగాని, ఒక సంఘంగాని, భిన్న కాలాలలో, భిన్న పరిస్థితులలో తన జీవితప్రమాణాన్ని, విధానాన్ని అభివృద్ధి చేసుకోడానికి, తన సుఖ సంతోషాల్ని ఇనుమడింపజేసుకోవడానికి, తన చుట్టూవున్న ప్రకృతి తత్వాన్ని అవగాహన చేసుకోవడానికి, భౌతికంగా మానసికంగా నిరంతర కృషి చేస్తుంది. ఆ కృషి ఫలితమే, ఆ జాతి లేక సంఘంయొక్క సంస్కృతి అని చెప్పవచ్చును.

"సంస్కృతి యనగా నాగరికత, లలితకళలు, సారస్వతము, సభ్యత, దైనందినాభివృద్ధి మున్నగు నుత్తమ గుణములన్నియు కలసిన విశిష్ట గుణము" అని కీ.శే. సురవరము ప్రతాపరెడ్డిగారు తమ "ఆంధ్రుల సాంఘిక చరిత్ర"లో సంస్కృతిని నిర్వచించారు. కాని, కొందరు విమర్శకులు నాగరకత, సంస్కృతి ఒకటి కావనీ, నాగరకత సంస్కృతిలో చేరదనీ అభిప్రాయపడినట్లు కనబడుతుంది. నాగరకత లేని సంస్కృతి ఉండదు; ఉండలేదు. కాని సంస్కృతి లేకుండా నాగరకత ఉండవచ్చును. – ఇది వారి వాదసారాంశం.

"If we attempt to differentiate between culture and civilisation, we might say that civilisation is the organisation of life which makes a civil society possible. Such a civil society is the condition for corporate life in which individuals can pursue fruitful and creative activity. Culture, on the other hand, is the resultant of such organisation and expresses itself through language and art, through philosophy and religion, through social habits and customs, and through political institutions and economic organisations. Not one of them is separately culture, but collectively they constitute the expression of life which we describe as culture. Civilisation is the organisation of society which creates the conditions of culture. There can, therefore, be no culture without civilisation, but there may be civilisations which have not yet developed their culture...culture is the efflorescence of civilisation...culture was, therefore, the result of liberation from the urgency of the problem of existence while civilisation was the form of machinery evolved for the achievement of such liberty."*

ప్రప్రథమంగా మానవుడు పరిష్కరించుకోవలసినది అస్తిత్వ సమస్య (problems of existence). ఆ సమస్యా పరిష్కారానికి మానవుడు కొంత సాధనసామగ్రిని పెంపొందించుకుంటాడు. ఆ సాధన సామగ్రి అంతా నాగరకతా చిహ్నంగా పరిగణింపబడుతుంది. ఆ సమస్యాపరిష్కారానంతరం సంస్కృతి జనిస్తుంది. అస్తిత్వ సమస్యాపరిష్కారఫలమే సంస్కృతి. మానవుడు మొదట తన ఉనికిని సుస్థిరం చేసుకున్న తరువాత, భౌతికంగా తనకు కావలసిన సాధన సామగ్రిని సమకూర్చుకున్న తరువాత, మానసికంగా తనకు ఉల్లాసాన్ని ఇచ్చే కళలు, వినోదాలు మొదలైనవాటిని గురించీ, తన మేధకు తృప్తినిచ్చే ఆధ్యాత్మిక విషయాలగురించీ కృషిచేయడానికి ఆరంభిస్తాడనీ, తత్కృషిఫలితాలే మానవ సంస్కృతి చిహ్నాలుగా పరిగణింపబడుతున్నాయనీ మీది వివరణ సారాంశం.

*Indian Heritage, Humayun Kabir, p. 37.

కాని, మానవశాస్త్ర (Anthropology) పరిశోధన ఫలితాన్నిబట్టి చూస్తే, ఈ వాదం నిలబడేటట్లు కనబడదు. ఇంచుమించుగా ఒక శతాబ్దికి పూర్వమే ఫ్రాన్సుదేశపు గుహలలో ప్రాక్తన మానవుడు వేసిన కొన్ని చిత్రాలను, చేసిన చెక్కడపు పనిని మానవశాస్త్రజ్ఞులు కనుగొన్నారు. ఇటీవల భీంబెట్కా గుహల్లో శ్రీ మిశ్రాగారు కొన్ని చిత్రాలను కనిపెట్టారు. వీటిని ప్రాక్తన మానవుడు క్రీ॥పూ॥ 25000 సంవత్సరాలు ఆ ప్రాంతంలో చిత్రించి ఉంటాడని వారి అభిప్రాయం. కాబట్టి తన అస్తిత్వం సుస్థిరం అయేవరకూ మానవుడు కళలు మొదలయినవాటిమీద దృష్టి సారించలేదనడం శాస్త్రసమ్మతంగా ఉన్నట్లు కనబడదు. అయితే, నాగరకత పెరిగినతరువాత మానవుడు తన సాంస్కృతిక కార్యక్రమాల్ని ద్విగుణితోత్సాహంతో నిర్వహించి ఉండవచ్చు. నేడు బహుముఖాల అభివృద్ధిచెందుతూ ఉన్న సంగీత సాహిత్య నాట్య కళలకి మూలం ప్రాక్తన మానవుడి ఆట పాట అన్న విమర్శక సిద్ధాంతాన్ని మనం విస్మరించకూడదు. ఇది నాగరకత, ఇది సంస్కృతి, ఈ కాలంనుంచి నాగరకత ప్రారంభమైంది, ఈ కాలంనుంచి సంస్కృతి ప్రారంభమైంది అని ఇదమిత్థంగా నిర్ణయించి చెప్పడానికి తగిన ఆధారాలు ఇంకా లభించలేదు. కాని సంస్కృతికి అంకురార్పణ ప్రాక్తన మానవుడికాలంలోనే జరిగిందని మాత్రం నిశ్చితంగా చెప్పవచ్చు. మానవుణ్ణి ప్రప్రథమంగా ఆకర్షించిన కళ చిత్రలేఖనం అనీ, చెక్కడం (దంతాలు, కొమ్ములు మొదలైన వాటిమీద బొమ్మలు చెక్కుట – engraving) కూడా తత్సమకాలికమే అనీ మానవశాస్త్రజ్ఞుల అభిప్రాయం. ఏది ఏమైనా, మానవుడు నాగరకదశకు వచ్చేసరికి చాలకాలం పట్టింది. కళలు, మతము మొదలైనవాటికి బీజావాపన ప్రాక్తన మానవుడికాలంలోనే జరిగింది. ఒక్క విషయం మాత్రం మనం నిస్సందేహంగా అంగీకరించవచ్చు. నాగరకతకలవారందరూ సంస్కృతికలవారని చెప్పడానికి వీల్లేదు. కాబట్టి సూక్ష్మాతిసూక్ష్మంగా పరిశీలిస్తే నాగరకతకి, సంస్కృతికి కొంత భేదం కలదు అనే సిద్ధాంతం దోషదూషితం కాదని మనం అంగీకరించాలి. సంస్కృతి ప్రజాజీవితానికి సంబంధించింది కాబట్టి సాంఘికచరిత్రే సాంస్కృతిక చరిత్ర.

## సాంస్కృతిక చరిత్ర – సాధన సామగ్రి :

దేశచరిత్ర వ్రాయడానికి పనికివచ్చే సాధనసామగ్రి అంతా సాంస్కృతిక చరిత్ర వ్రాయడానికి పనికివస్తుంది. కాని, పరిశీలనావిధానంలోను, దృక్పథంలోను దేశచరిత్రకారుడికి, సాంస్కృతికచరిత్రకారుడికి భేదం ఉంటుంది. ఉదాహరణకు, శ్రీకృష్ణదేవరాయలు రచించిన ఆముక్తమాల్యదను తీసుకోవచ్చు. అందులో రాయల దిగ్విజయవర్ణన దేశచరిత్రకారుడికి అక్కరకు వస్తే, ఆ రాజకవి విష్ణుచిత్తుని జీవిత వర్ణనలోను, ఇతర వర్ణనలలోను వ్యక్తంచేసిన ప్రజాజీవితం సాంస్కృతిక చరిత్ర

కారుడికి పనికివస్తుంది. సాంస్కృతికచరిత్ర రచనకు ముఖ్యంగా ఉపకరించేది జానపద సాహిత్యం. దురదృష్టవశాత్తు పండితకవుల నిరసనభావంవల్ల చాలకాలం అది అనాదృతంగా ఉండిపోయింది. ఇటీవల అందులో మంచి కృషి జరుగుతున్నది. వసుచరిత్రాది ప్రబంధాలవల్ల మనకు తెలిసే సాంఘికచరిత్ర చాల స్వల్పం. కదరీపతి శుకసప్తతి మొదలయిన ప్రబంధాలే మన కందుకు బాగా ఉపకరిస్తాయి. పాల్కురికి సోమనాథాది స్వతంత్రకవులు రచించిన గ్రంథాల్లో జానపదజీవితం మన కెంతో స్పష్టంగా గోచరిస్తుంది. నన్నయాదుల గ్రంథాలు అంతగా ఉపకరించవు. స్థానిక చరిత్రలు (కైఫీయతులు) విదేశీయుల వ్రాతలు ఉపయోగపడతాయి గాని, వాటి పరిశీలనలో సాంస్కృతిక చరిత్రకారుడు, చాల జాగరూకత వహించవలసి ఉంటుంది. ఆ వ్రాతల్లో పుక్కిటి పురాణాలు, అత్యుక్తులు సకృత్తుగా అబద్ధాలు కూడా ఉంటాయి. వాటిని పరిహరించుకుంటూ పరిశీలిస్తే నిజం బయటపడుతుంది. దేశచరిత్ర వ్రాయడంకంటె సాంస్కృతికచరిత్ర వ్రాయడం కష్టతరం.

## ఆంధ్రుల చరిత్ర

ఆంధ్రుల దేశచరిత్రనుగురించి సంక్షేపంగా చెప్పడానికి కూడా ఈ చిన్న వ్యాసంలో అవకాశం లేదు. అయినా స్థూలంగా కొన్ని ముఖ్య విషయాలు మాత్రం తెలుసుకోవచ్చు. బౌద్ధయుగానికి పూర్వం భారతదేశచరిత్ర స్పష్టంగా, నిర్దిష్టంగా కనబడదు. అటువంటి పరిస్థితిలో ప్రాచీనకాలంలోని ఆంధ్రదేశచరిత్ర ఎంత దృశ్యాదృశ్యంగా ఉంటుందో, వేరే చెప్పవలసిన పనిలేదు. ఐతరేయ బ్రాహ్మణంలో ఆంధ్ర శబ్దం ఉంది. అక్కడ అది జాతి పరంగా వాడ బడ్డది. రామాయణ కాలంలో, ఈ ఆంధ్ర దేశం చాల వరకు దండకాటవి. మహా భారత కాలానికి ఆంధ్రులు దక్షిణా పథంలో నివసిస్తున్నట్లు కనబడుతుంది. ఆంధ్రానికి పర్యాయ పదాలుగా, నేడు తెలుగు, తెనుగు అనే పదాలు వాడబడుతున్నాయి. తెలుగు (తెలుంగు, తెలింగ) రూపమే మొదటిదని మల్లంపల్లివారి అభిప్రాయం. ఈ పదానికి వ్యుత్పత్తిగాని, అది జాతి వాచకంగా మొదట ప్రయుక్త మయిందా, భాషా వాచకంగా ప్రయుక్త మయిందా ? అన్న ప్రశ్నలకి సమాధానంగాని, ఇదమిత్థంగా, సప్రమాణంగా, చెప్పడానికి ఆధారాలు లేవని, వారే చెప్పి ఉన్నారు. అసలు ఆంధ్రులూ తెలుగువారూ, ఒకరౌనా కాదా ? అన్న ప్రశ్నకి కూడా స్పష్టమైన సమాధానం లేదు. ఆంధ్రులు ఔత్తరాహులని కొందరి అభిప్రాయం. మన పురాణ గాథల్నిబట్టి చూస్తే ఆంధ్రులు ఔత్తరాహులుగానే కనబడతారు. నన్నయ నన్నెచోడులకి పూర్వం. తెనుగు పదం వాడుకలో ఉన్నటు కనబడదు. నన్నయ కాలంలోనే తెనుగునకు రూపాంతరంగా తెలుగు ప్రయుక్తమై ఉంది. ఆంధ్ర పదమే ప్రాచీన మయినదని, ఆంధ్ర పదం అర్వాచీనమని, చారిత్రకుల నిశ్చితాభి

ప్రాయం. త్రిలింగ, త్రినగ శబ్దాల నుంచి, తెలుగు తెనుగు పదాలు నిష్పన్నమైనాయి అని చెప్పే పండిత నిర్వచనం కృతకం.

బౌద్ధ యుగంలో, ఈ దేశంలోని వివిధ భాగాల్ని వివిధ నామాలతో వ్యవహరించేవారు. ఇప్పటి తెలంగాణా ప్రదేశాన్ని మంజీర దేశం అనీ, కృష్ణానదీ ప్రాంతాన్ని నాగభూమి అనీ, వజ్రదేశం అనీ పిలిచేవారు. మెగస్తనీస్ వ్రాతలలో, బహు పరాక్రమాఢ్యులుగా ఆంధ్రులు వర్ణింపబడి ఉన్నారు. ఈ ఆంధ్ర రాజ్యాన్ని ఎవరు ఎప్పుడు స్థాపించారు అన్న ప్రశ్నలకి చారిత్రకంగా సమాధానం చెప్పడం కష్టం. ఏది ఎలాగున్నా, క్రీ.పూ. నాల్గవ శతాబ్దికి ఆంధ్ర రాజ్యం అంత మహోన్నత దశకు వచ్చిందంటే, ఆ రాజ్య స్థాపన జరిగి అప్పటికి ఒక నూరేళ్లయినా అయి ఉండాలి. కాబట్టి క్రీ.పూ. ఐదవ శతాబ్దిలో ఆంధ్ర రాజ్య స్థాపన జరిగి ఉండవచ్చు. అప్పుడు ఈ దేశాన్ని పరిపాలిస్తున్న రాజవంశం ఏదో మనకు తెలియదు. మౌర్య సామ్రాజ్య పతనానంతరం ఆంధ్రులు స్వతంత్రులయినారు.

శాతవాహనుల కాలం నుంచే మనకు ఆంధ్రదేశ చరిత్ర స్పష్టంగా కనబడుతుంది. ఇంచు మించుగా 450 సంవత్సరాలు శాతవాహనులు ఆంధ్ర దేశాన్ని పరిపాలించారు (క్రీ.పూ. 225 – క్రీ.శ. 225). క్రీ.శ. 225 నుంచి 625 వరకు, ఆంధ్ర దేశాన్ని అనేక రాజవంశాలవారు, భిన్న స్థలాల్లో పరిపాలించారు. 1. ఇక్ష్వాకులు: వీరి చరిత్రకు నాగార్జునకొండ, జగ్గయ్యపేట, రామిరెడ్డిపల్లి శాసనాలు ఆధారములు. వీరి శాసనాలు ప్రాకృతంలోనే ఉన్నాయి. 2. పల్లవులు (మొదటి): వీరి శాసనాలు మొదట ప్రాకృతంలో తరువాత సంస్కృతంలో ఉన్నాయి. పల్లవులు ఆంధ్రులే అని కొందరి వాదం. 3. బృహత్పలాయనులు: వీరు కృష్ణానది ఉత్తరతటి ప్రదేశాన్ని పరిపాలించారు. ఇంత వరకు వీరి శాసనం ఒక్కటే లభించింది. అది కొండముది శాసనం; జయవర్మ మహారాజుది. 4. ఆనంద గోత్రీకులు: కృష్ణానదీ దక్షిణ ప్రదేశాన్ని పరిపాలించారు. 5. శాలంకాయనులు: కృష్ణా గోదావరీ మధ్య ప్రదేశంలో కొంత భాగాన్ని పరిపాలించారు. వీరందరూ తమ గోత్రాన్నే కాని కులాన్ని చెప్పుకోలేదు. 6. విష్ణుకుండినులు: వీరు శ్రీపర్వతస్వామి పాదానుధ్యాతులు. వైదిక మార్గ నిరతులు. వీరిలో మాధవవర్మ నామధేయులు ముగ్గురున్నట్లు కనబడుతుంది. వీరిలో మూడవ మాధవవర్మను గురించి చాల గాథలున్నాయి. ఈయన పదకొండు అశ్వమేధ యాగాలు, ఒక వేయి అగ్నిష్టోమాలు చేసాడట. దీన్నిబట్టి ఆనాడు వైదికమతం ఎంతగా విజృంభించిందో మనకు తెలుస్తుంది. నేడు క్షత్రియులుగా పరిగణింపబడుతూ ఉన్న, పూసపాటివారు మొదలైనవారు, మాధవవర్మనే తమ మూల పురుషుడుగా చెప్పుకుంటారు. క్రీ.శ. 624 లో, చాళుక్యరాజు రెండవ పులకేశి మాధవవర్మను జయించాడు. అంతతో వీరి రాజ్యం అంతరించింది. చాళుక్యుల్లో,

తూర్పు చాళుక్యులే వేగీ దేశాన్ని పరిపాలించారు. కుబ్జ విష్ణువర్ధనుడు వీరి మూల పురుషుడు. ఇతడు రెండవ పులకేశి తమ్ముడు.

## తూర్పు చాళుక్యులు (క్రీ.శ. 625–1077–1118) :

వీరు చేసిన భాషా సేవ అపారమైనది. వీరి వరకు తెలుగు ప్రజాభాషేగాని, రాజభాష కాదు. వీరు తెలుగును రాజభాషగా చేశారు. పండిత పరిషత్తులు స్థాపించి, తెలుగును అభివృద్ధిలోకి తెచ్చారు. వీరి కృషి ఫలితంగానే, రాజరాజ నరేంద్రుడి కాలంలో, ఆంధ్రమహాభారతం అవతరించింది.

## వెలనాటి చోడులు — తెలుగు చోడవంశాలు (క్రీ.శ. 1108–1206) :

రేపల్లె తాలూకాలోని చందవోలు లేక ధనదపురము రాజధానిగా, వెలనాటి చోడులు, కృష్ణానదికి దక్షిణాన ఉన్న భాగాన్ని పరిపాలించారు. దీన్ని ఆ కాలంలో వెలనాడు అనే వారు. ఇంచుమించుగా నేటి గుంటూరు మండలానికి అది సరిపోతుంది. వీరి కాలంలో బౌద్ధమతానికి కొంత స్థానం ఉండేది. కాని, వీర శైవమత విజృంభణకు అది తట్టుకోలేక పోయింది. సుప్రసిద్ధుడైన మల్లికార్జున పండితుడు వీరి ఆస్థానానికి వెళ్ళిన నిదర్శనా లున్నాయి.

తెలుగు చోడులు అనబడేవారు కృష్ణానదికి దక్షిణాన, మాండలిక రాజులై, చిన్న చిన్న రాజ్యాల్ని పరిపాలించేవారు. వీరు, అనేక కుటుంబాలకు చెందినవారు. వీరిలో రేనాడు, పొత్తపినాడు, కొణిదెన, నెల్లూరు ప్రదేశాలను పరిపాలించినవారు చాల ప్రసిద్ధులు. తెలుగులో మొట్టమొదట శాసనాలు వేయించిన కీర్తి రేనాటి చోడులకే చెందుతుంది. సుప్రసిద్ధాంధ్రకవి నన్నెచోడుడు పొత్తపినాటి చోడ వంశానికి చెందినవాడని కొందరు పరిశోధకుల అభిప్రాయం. తిక్కన నిర్వచనోత్తర రామాయణ కృతిభర్త మనుమసిద్ధి నెల్లూరు శాఖకు చెందినవాడు. దీనినే విక్రమ సింహపుర చోడ శాఖ అని అంటారు. వీరు మధురాంతక పొత్తపి చోడ శాఖకు చెందినవారు.

## కాకతీయులు (క్రీ.శ. 1000 – 1323) :

వీరి రాజధాని ఓరుగల్లు దీని సంస్కృతీకరణం ఏకశిలానగరం. దీన్ని ఆంధ్ర నగరం అనికూడా అనేవారు. కాకతి అనే దేవతను ఆరాధించడంచేత, వీరికి కాకతీయులు అనే పేరు వచ్చిందనీ కొందరి అభిప్రాయం. ఈ దేవత అనుగ్రహంవల్ల గుమ్మడి తీగకు వీరి మూలపురుషుడు పుట్టేడట. కాకతి జైన దేవత అన్నారు కొందరు. ఆమె దుర్గ అన్నాడు విద్యానాథుడు. వీరి మూలపురుషుడైన బేతరాజు ముఖ్యపట్టణం కాకతిపురం అని కాజీపేట శాసనం చెబుతుంది. కాకతీయులు మొదట జైనులైనా, తరువాత శైవులుగా మారినట్లు కనబడుతుంది. ఆనాడు శైవుల

గోళకీ మఠాలు ప్రసిద్ధంగా ఉండేవి. శైవంతోపాటు వైష్ణవంకూడా బలంగానే ఉండేది. జైనుల ప్రాబల్యం తగ్గలేదు. బౌద్ధం ఇంచుమించుగా నశించింది. కాకతీయులు మూడువందల సంవత్సరాలకు పైన, ఆంధ్రదేశాన్ని పరిపాలించారు. గణపతిదేవుడి కాలానికి ఇది ఒక మహా సామ్రాజ్యంగా పరిణతి చెందింది. వీరికి ప్రచండమైన సైన్యం ఉండేది. వీరు నవలక్ష ధనుర్ధరాధి నాథులని ప్రశంసింపబడ్డారు. రెడ్డి, వెలమ, కమ్మ కులములవారు మహాసేనానులై, ఈ రాజ్యాన్ని పరిరక్షిస్తూ ఉండేవారు. వీరు కళాపోషకులు. వీరి ఇంకొక కులదైవం స్వయంభూదేవుడు. వీరు స్వయంభూదేవునికై కట్టించిన దేవాలయం ఆనాడు మహా ప్రసిద్ధంగా, శిల్పకళా శోభితంగా ఉన్నట్లు, క్రీడాభి రామకర్త వర్ణించాడు. ఆంధ్ర చరిత్రలో, కాకతీయుల రాజ్యకాలం మరువరాని మహోజ్జ్వల ఘట్టం.

## రెడ్డిరాజులు (క్రీ.శ. 1324–1424–1430) ; వెలమరాజులు (క్రీ.శ. 1330–1430) :

కాకతీయ సామ్రాజ్య పతనానంతరం, తత్సేనానాయకులైన రెడ్లు, వెలమలు, వేరు వేరు రాజ్యాలను స్థాపించారు. అద్దంకి రాజధానిగా ప్రోలయవేమ డొక రాజ్యాన్ని స్థాపించగా, రాచకొండ, దేవరకొండ పట్టణములు రాజధానులుగా, పద్మనాయక వంశీయులైన వెలమ వీరులు రెండు రాజ్యాలను స్థాపించారు. రాచకొండ రాజ్యమును స్థాపించిన మహావీరుడు సింగమ నాయకుడు. ఈతని కుమారుడు అనపోతానాయకుడు బల పరాక్రమాల్లో అద్వితీయుడు. ముసునూరి కాపయనాయకుణ్ణి జయించి ఈ మహావీరుడు తెలంగాణాకుకూడా అధిపతి అయేడు. అనపోతా నాయకుడు తన సోదరుడైన మాధవ నాయకుణ్ణి దేవరకొండ రాజ్యానికి పాలకుడుగా నియమించాడు. ఈ రెండు రాజ్యాలవారు, వ్యక్తిగతంగా స్వతంత్రులైనా, ఇతర రాజ్యాలతో వివాదాలు వచ్చినప్పుడు, ఒకేమాటమీద నడిచేవారు. అనపోతా నాయకుడి తరువాత, అతని పుత్రుడు రెండవ సింగమ నాయకుడు రాజయేడు. ఈయన చాలా ప్రసిద్ధుడు. మహా విద్వాంసుడు. సర్వజ్ఞ బిరుదాంచితుడు. కవిపండిత పోషకుడు. రసార్ణవ సుధాకర గ్రంథకర్త. దేవరకొండ నేలినవారిలో లింగమ నాయకుడు మహాప్రసిద్ధుడు. వెలమ ప్రభువులు మొదట శైవులే, కాని వేదాంత దేశికుడి ప్రభావంవల్ల వైష్ణవం స్వీకరించారు. అనపోతా రెడ్డికాలంలో రెడ్లు, తమ రాజధానిని కొండవీటికి మార్చుకున్నారు. రాజమహేంద్రవరం రాజధానిగా, మరొకరెడ్డి వంశంవారు పూర్వాంధ్ర దేశాన్ని పరిపాలించారు.

## విజయనగరసామ్రాజ్యం (క్రీ.శ.1336–1565) :

విద్యారణ్యుని తపఃఫలంగా ఆవిర్భవించినది విజయనగర రాజ్యం. హరిహరుడు, బుక్కరాయలు అనే సోదరు లిర్వురు ఈ సామ్రాజ్యాన్ని స్థాపించారు.

ద్వితీయ ప్రతాపరుద్రుడి కాలంలో వీరు కోశాధ్యక్షులు. వీరు సంగమ వంశీయులు. తరువాత సాళువ, తుళువ, ఆర్వేటి వంశాలవారు ఈ సామ్రాజ్యాన్ని పరిపాలించారు. ఇంచుమించు రెండువందల యేభై యేళ్లు, విజయనగర సామ్రాజ్యం అప్రతిమాన వైభవంతో వర్ధిల్లింది. తుళువ వంశీయుల కాలం ఆంధ్ర వాఙ్మయానికి స్వర్ణయుగం. విజయనగర రాజులందరూ కళాపోషకులు. వేదభాష్యాలు వెలసిన కాలమిది. సంగమ వంశీయుడైన ప్రౌఢదేవరాయలే శ్రీనాథ కవిసార్వభౌముడికి కనకాభిషేకం చేసిన రసిక చక్రవర్తి. క్రీ.శ. 1565లో జరిగిన తాళికోట యుద్ధంలో విజయనగరం వారు పరాజితులయేరు. ఆ తరువాత కొంతకాలం ఈ సామ్రాజ్యం ఉన్నా, దాని పూర్వ వైభవం మరి రాలేదు. ఆంధ్ర కర్ణాట సంస్కృతులకు కూడలిగా ఉండి, సకల కళానిలయమైన విజయనగర పట్టణమే నశించింది.

తంజావూరు, మధుర, పుదుక్కోటలలో, నాయకరాజులు, ఆంధ్ర సారస్వతాన్ని ఆదుకున్నారు. ఆంధ్ర సంస్కృతిని దక్షిణదేశంలో వ్యాప్తిలోకి తెచ్చారు.

## సంస్థానములు :

మొదట ఆంధ్రదేశంలో సంస్థానాలను ఏర్పరచినవారు గోల్కొండ నవాబులు. 1802 లో ఆంగ్ల ప్రభుత్వం ఆయా సంస్థానాధిపతులకి, వారివారి అధికారాలను దఖలు పరచి, పేష్కసు నిర్ణయించింది. ఈ సంస్థానాధీశ్వరులు వెలమ, కమ్మ, క్షత్రియ, రెడ్డి కులానికి చెందిఉన్నారు. చిన్నచిన్న బ్రాహ్మణ సంస్థానాలు ఉన్నవి. నూజువీడు, బొబ్బిలి, వేంకటగిరి, పిఠాపురం మొదలయినవి వెలమ సంస్థానాలు. వీరు పద్మనాయక వెలమలు. విజయనగరం, పెద్దాపురం మొదలైనవి క్షత్రియ సంస్థానాలు. అమరావతి, కపిలేశ్వరపురం మొదలయినవి కమ్మవారి అధీనంలో ఉన్న సంస్థానాలు. గద్వాల మొదలయినవి రెడ్ల సంస్థానాలు. ఈ సంస్థానాధిపతులందరూ, లలితకళాభిజ్ఞులు. కవి పండిత పోషకులు. కాకలు తీరిన మహాపండితులనేకులు వీరి ఆస్థానాల్లో ఉండేవారు.

## ఆధునికయుగం — ఆంధ్ర సంస్కృతి (క్రీ.శ. 1800 నుండి) :

అధునికయుగంలో ఆంధ్ర సంస్కృతి బహుముఖాల అభివృద్ధి చెందింది. క్రీ.శ. 1953 లో ఆంధ్రరాష్ట్రం అవతరించింది. అప్పటి అఖిలభారత ప్రధానామాత్యులయిన పండిత జవాహర్‌లాల్ నెహ్రూగారు 1953 ఆగస్టు 1 వ తేదీని కర్నూలుకు వచ్చి నూతన ఆంధ్రరాష్ట్ర ప్రారంభోత్సవాన్ని జరిపించారు. ఆంధ్రరాష్ట్రావతరణకు పూర్వమే మనదేశములో వివిధ రంగాలలో కృషి సమగ్రంగా జరుగుతూనేవుంది. శ్రీ కందుకూరి వీరేశలింగం పంతులు, శ్రీ ఆర్. వెంకటరత్నంనాయుడు గారు మొదలయినవారు సంఘ సంస్కారానికి బహు విధాల ప్రయత్నాలు చేశారు. మహాత్మాగాంధీగారు ప్రారంభించిన హరిజనోద్ధరణ ఉద్యమాన్ని కూడా శ్రీ గొల్లపూడి సీతారామశాస్త్రిగారు, దేశభక్త కొండా వెంకటప్పయ్య పంతులుగారు, డాక్టర్

భోగరాజు పట్టాభిసీతారామయ్య పంతులుగారు, దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వర రావు పంతులుగారు మొదలయినవారు చేపట్టి నిర్వహింపసాగిరి. ఆ కాలంలోనే తెలంగాణాలో శ్రీ కొమర్రాజు లక్ష్మణరావు పంతులుగారు చారిత్రక పరిశోధనలు ప్రారంభించారు. రాజమహేంద్రవరంలో ఆంధ్ర చరిత్ర పరిశోధక సంస్థ (Andhra Historical Research Society) ఒకటి స్థాపింపబడింది. దీనిలో శ్రీ రాళ్లబండ సుబ్బారావుగారు, శ్రీ భావరాజు వేంకట కృష్ణారావు గారు మొదలయిన ఉద్దండ పండితులు పరిశోధన సాగించారు. ఆంధ్ర సాహిత్య పరిషత్తు, సాహితీ సమితి, నవ్య సాహిత్య పరిషత్తు మొదలైనవి ఆ కాలంలోనే సాహిత్యాభివృద్ధికి చాలా కృషి చేశాయి.

క్రీ.శ. 1926 లో మొట్టమొదట బెజవాడలో ఆంధ్రవిశ్వకళాపరిషత్తు స్థాపింప బడింది. తరువాత క్రీ.శ. 1931లో వాల్తేరుకు మార్చబడ్డది. దీనికి ఉపాధ్యక్షులుగా డా. కట్టమంచి రామలింగారెడ్డి గారు, డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ గారు, డా. వాసిరెడ్డి శ్రీకృష్ణాగారు మొదలైన మహావిద్వాంసులు పనిచేసి ఈ సంస్థయొక్క సర్వతోముఖాభి వృద్ధికి పాటుపడ్డారు.

ఆధునికయుగంలో ముఖ్యంగా చెప్పవలసినది నాటకకళాభివృద్ధి. పూర్వం మనకి యక్షగానాలు, వీధి నాటకాలు తప్ప మార్గ నాటకాలకి సరియైన నాటకాలు పుట్టినట్లు కనబడదు. ఈ కొరత ఆధునికయుగంలోనే తీరింది. ఈ విషయంలో చక్కని కృషిచేసి ఆంధ్రనాటక కళాపరిషత్తును స్థాపించి నాటక కళాభివృద్ధికి సర్వవిధాల తోడ్పడినవారు నేటి ఆంధ్రవిశ్వకళాపరిష దుపాధ్యక్షులు శ్రీ రాజా మేకా రంగయ్యప్పారావుగారు. వీరి జనకులు శ్రీ రాజా వెంకటాద్రి అప్పారావుగారు గోవర్ధనోద్ధరణము మొదలయిన నాటకాలు కూడా రచించారు. ధర్మవరము రామ కృష్ణమాచార్యులు, తిరుపతి వేంకటకవులు మొదలయినవారు అనేక నాటకాలు వ్రాసి ఆంధ్ర నాటకకళను అభివృద్ధిలోనికి తీసికొనివచ్చారు. చిత్రలేఖనంలో కూడ ఈ కాలంలో మంచి అభివృద్ధి కనబడుతుంది. శ్రీ దామెర్ల రామారావుగారు, శ్రీ అడవి బాపిరాజుగారు మొదలయిన వారు, కూల్డ్రే దొరగారి శిష్యరికంచేసి భావచిత్ర, రూపచిత్రాత్మకమైన చిత్రకళను అభివృద్ధిలోనికి తెచ్చేరు. హరికథా పితామహులు శ్రీ ఆదిభట్ల నారాయణదాసుగారు అనేకములైన హరికథలను వ్రాసి ఆంధ్ర వాఙ్మయమునకు ఒక నూత్నాలంకారాన్ని సమర్పించారు.

## ఆంధ్రప్రదేశ్ అవతరణ :

1956 నవంబరు 1 వ తేదీనాడు ఆంధ్ర తెలంగాణములు రెండు కలిసి ఆంధ్రప్రదేశ్‌గా మన రాష్ట్రం రూపొందింది. ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తరువాత ఆంధ్ర సాహిత్య అకాడమీ, సంగీత నాటక అకాడమీ మొదలయినవి స్థాపింపబడ్డాయి.

ఆంధ్ర సారస్వత విషయంలోను, నాట్య సంగీతముల విషయంలోను ఇవి చేస్తున్న కృషి అపారమైనవి. ఇంతేగాక మహిళల ఉద్యమము, హరిజనోద్ధరణకు సంబంధించిన ఉద్యమము మొదలైన ఉద్యమాలు దేశంలోని సాంస్కృతిక ప్రగతికి చాలా తోడ్పడుతున్నాయి. ప్రత్యేకంగా ఈ సంవత్సరం మహిళలకు సంబంధించిన దానిగా ప్రకటించబడింది. ఈ మధ్యనే బెజవాడలో మహిళా సభలు విజయవంతంగా జరుపబడ్డాయి. ప్రపంచ తెలుగు మహాసభలు కూడా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులు శ్రీ జలగం వెంగళరావుగారి అధ్వర్యంలో వైభవోపేతంగా జరుగుతున్నాయి. ఇదంతా ఆధునికయుగంలో ఆంధ్రులు సాధించిన ప్రగతికి నిదర్శనం.

## ఆంధ్రుల సంస్కృతి

మతం :

ఆంధ్ర దేశంలోనే కాదు, భారత దేశం అంతటా రాజకీయ సాంఘికాది విషయాలన్నీ మతంతో ముడి పెట్టబడి ఉండేవి. అసలు మానవ చరిత్రలోనే మతానికి ఒక ప్రముఖ స్థానం ఉంది. మత ప్రాతిపదిక మీదనే ఆంధ్ర దేశంలో లలిత కళలు, సాహిత్యం అవిర్భవించాయనడంలో అతిశయోక్తి లేశమాత్రం కూడా లేదు. ఆంధ్ర శాతవాహనులు వైదిక మతావలంబులు. కాని, బౌద్ధాన్నికూడా ఆదరించారు. ప్రజానీకంలో బౌద్ధ మతానికే ప్రాధాన్యం ఉండేది. అసలు శాతవాహనుల కాలంలో భారత దేశం అంతటిలోనూ ఆంధ్ర దేశమే బౌద్ధానికి ప్రధాన కేంద్రం అని నిశ్చితంగా చెప్పవచ్చు. మహాయాన ప్రవక్త ఆచార్య నాగార్జునుడు యజ్ఞశ్రీ శాతకర్ణి కాలంలో ఉన్నాడనడానికి నిదర్శనాలున్నాయి. నేటి నాగార్జున కొండను ఆనాడు శ్రీపర్వతం అనేవారు. ఆచార్య నాగార్జునుడు ధనకటక మహాచైత్యానికి ప్రాకారాన్ని కట్టించేడు. శ్రీ పర్వతంమీద మంటపాలయాల్ని వెలయించాడు. ఇక్ష్వాకులు బౌద్ధులు కారు. కాని, వీరికాలంలో బౌద్ధం బాగా వ్యాప్తిలోనికి వచ్చింది. నాగార్జున కొండలోని కట్టడాలు వీరి కాలంలోనే నిర్మింపబడ్డాయి. దీని కారణం కొంత విచిత్రంగా ఉంది. రాజులు మహాసేన పాదానుధ్యాతులైనా, క్రతువులు చేసినా, రాణులు మాత్రం బౌద్ధమతాన్నే అభిమానించేవారు. విష్ణుకుండినులు, పూర్వ చాళుక్యులు వైదిక మతాన్నే ఆదరించారు. వీరు పరమ మాహేశ్వరులుగా కీర్తింపబడ్డారు. చాళుక్య రాజుల్లో రెండవ విజయాదిత్యుడు 108 శివాలయాలను కట్టించాడట. కాకతీయులు మొదట జైనులు; తరువాత శైవులయారు. పూర్వ చాళుక్యులలో కూడా జైన మతాన్ని అవలంబించిన రాజులున్నారు. రాజరాజు తండ్రి విమలాదిత్యుడు జైనాన్ని అవలంబించినట్లు కనబడుతుంది. గోళకీ మతాచార్యుడు విశ్వేశ్వరుడు కాకతీయ గణపతి దేవుడుకి "చిన్మయ దీక్ష" నిచ్చాడట. విజయనగర రాజులలో సంగమ వంశమువారు శైవులే. సాళువ, తుళువ, ఆర్వీటి

వంశములవారు వైష్ణవులు. రెడ్డి రాజులు శైవులు. ఏది ఎలావున్నా పూర్వం మన దేశాన్ని ఏలిన రాజులందరూ మతసహనం కలవారే. మత ప్రవక్తలలో మాత్రం అసహనం ఉండేది కాదు. కాకతీయులు జైనుల్ని హింసించారన్నది శుద్ధాబద్ధం; వారు శైవులైనా అన్ని మతాలవారిని సమాన బుద్ధితోనే చూచేవారు. జనుల్లో మత ద్వేషాలుండేవి. బౌద్ధ, జైన మతాలు మన దేశంలో క్షీణించడానికి వీర శైవ విజృంభణ ముఖ్యకారణం.

## వాస్తు శిల్పములు, చిత్రలేఖనము :

మన దేశంలో శిల్ప చిత్రలేఖనాది కళలన్నీ మొదట మతపరంగానే ఆవిర్భవించాయనీ, వాటి అభివృద్ధికి కూడా చాలవరకు మతమే కారణ మనీ ముందే చెప్పబడింది. బౌద్ధమత వ్యాప్తికీ, శిల్ప చిత్రలేఖనాల వ్యాప్తికీ చాల దగ్గర సంబంధం ఉంది. హైందవ కళాసంపద కూడా దేవాలయ నిర్మాణంలోనే కనబడుతుంది. శాతవాహనుల కాలంలో వాస్తుశిల్పం స్తూపచైత్య విహార నిర్మాణంలో పరాకాష్ట నందుకుంది. అమరావతి, భట్టిప్రోలు స్తూపాలు ఇందుకు ప్రబల నిదర్శనం. అజంతా గుహల్లో ఆంధ్ర చిత్రకారుల కళానైపుణ్యం గోచరిస్తుంది. చాళుక్యులు, కాకతీయులు, విజయనగరాధిపతులు అనేక దేవాలయాల్ని నిర్మించారు. దాక్షారామంలోని చాళుక్య శిల్పం, రామప్ప గుడిలోని కాకతీయ శిల్పం, హంపీలో ఇప్పటికీ గోచరిస్తున్న విజయనగర శిల్పం ఆ రాజన్యుల కళాపోషణా తత్పరతకీ ఆ శిల్పిశేఖరుల కళానిర్మాణ దక్షతకు ప్రత్యక్ష సాక్ష్యాలు.

## సంగీత నాట్యాలు :

దేవాలయ కుడ్య శిల్పాలలో గోచరించే నాట్యభంగిమల్నిబట్టి చాళుక్యుల కాలంలో నాట్యం అభివృద్ధిచెంది ఉంటుందని ఊహించవచ్చు. సంగీత కళాభి వృద్ధి ఎలా ఉండేదో చెప్పడానికి ఆధారాలు అంతగా కనపడవు. కాకతీయుల కాలంలో సర్వతోముఖంగా అభివృద్ధి చెందాయనడానికి నిదర్శనా లనేకం ఉన్నాయి. అలాగే రెడ్డి వెలమల రాజ్యకాలంలో కూడా ఇవి అభివృద్ధి చెందాయి. జాయప సేనాని నృత్త రత్నావళి, కుమారగిరి రచించిన వసంత రాజీయం మొదలయిన గ్రంథాలు ఆనాటి నాట్య కళాభివృద్ధిని వివరిస్తున్నాయి. రాచకొండ సర్వజ్ఞ సింగమనాయని సంగీత రత్నాకర వ్యాఖ్య, సంగీత సుధాకరము ఆనాటి ఆంధ్ర రచనలలో ముఖ్య మైనవి. విజయనగర సామ్రాజ్యంలో ఈ కళలు సర్వతోముఖంగా అభివృద్ధి చెందాయి. ఆనాటి ప్రబంధ కవులలో రామరాజ భూషణుడు సంగీత కళానిధి. అసలు శ్రీకృష్ణ దేవరాయలే సంగీతంలో సిద్ధహస్తులట. తంజావూరు నాయక రాజులు సంగీత నాట్యాలయెడ చూపిన మక్కువ అపారం. రఘునాథ నాయకుడు 'రఘునాథ మేళా' అనే వీణను కనిపెట్టాడట. నాట్య సంగీతాలలో పడి విజయ

రామవుడు రాజ్యాన్నే విడిచిపెట్టాడు. ఆనాటి యక్షగాన వాఙ్మయమంతా వారి నాట్య సంగీత కళాభిరుచికి నిదర్శనం.

సారస్వతం :

పూర్వ చాళుక్య రాజైన రాజరాజ నరేంద్రుడి కాలంలో ఆంధ్ర మహాభారతం అవతరించింది. మన వాఙ్మయంలో ఇప్పటికి లభించిన ప్రథమ మహాగ్రంథం అదే. కాని, నన్నయ భారత కవిత్వంవంటి రచన హఠాత్సంభవం కాదు. కాలేదు. అంతకుముందు కొంత వాఙ్మయం ఉండి ఉంటుంది. ఇది ఊహ మాత్రమే. తరువాత మన దేశాన్ని ఏలిన రాజులందరూ సారస్వతాన్ని పోషించారు. నిజానికి ఆంధ్ర కవి అనుభవించిన మహదైశ్వర్యం అనితర సాధారణం.

ఆటలు–వేడుకలు–వినోదాలు :

ఆధునికకాలంలో పూర్వపు క్రీడలు, వేడుకలు మొదలైనవాటిమీద ఆదరణ తగ్గిపోయింది. తత్కారణంగా మన సారస్వతంలో పేర్కొనబడ్డ క్రీడావిశేషాలు ఎటువంటివో, వాటిని ఏ ప్రకారంగా ఆడేవారో కూడా మనకు తెలియదు. వృత్తికారులు, నిఘంటుకారులు వాటి అర్థం చెప్పకుండా, కేవలం బాల్యక్రీడా విశేషమనో, క్రీడావిశేషమనో చెప్పి ఊరుకుంటారు. తెలిసినంతవరకు ఇక్కడ వివరించబడుతున్నాయి. అయ్యలరాజు నారాయణామాత్యుడు తన హంసవింశతిలో అనేక క్రీడల్ని పేర్కొన్నాడు. కాని అవి ఆడేవిధానం తెలియడం లేదు. అచ్చనగండ్లు కేవలం బాలిక లాడుకునే ఆట. కోతికొమ్మంచులు బాలురుమాత్రం ఆడదగినది. కుందికట్టు, కంబాలాట, పుట్టచెండ్లు, దాగిలిమూతలు మొదలైనవి బాలబాలికలు కలసి ఆడదగినవి. ఈ ఆటలలో చాలవాటికి పాటలు కూడా ఉంటాయి. పాటపాడుతూ, ఆట ఆడ్డం ఒక హాయి. ఈ ఆటలకి ఒక్కొక్క మండలంలో ఒక్కొక్క పేరు ఉండడం కూడా కద్దు.

వీటితోపాటు జాతీయములైన చెడుగుడు (కబాడి), బొంగరాలాట, గాలిపటాల ఎగురవేత మొదలయినవి కొంచెం పెద్దవాళ్లు ఆడే ఆటలు. సజీవ నిర్జీవ ద్యూతం మన కెప్పుడూ ఉంది. కోడిపోరువల్ల రాజ్యా లంతరించాయి. అలాటిదే పొట్టేళ్ళ పోరాటం. చదరంగం, పాచికలాట, పులిజూదము మొదలైనవి తీరుబడిగలవారి ఆటలు.

పూర్వగ్రంథాల్లో మల్లయుద్ధాలు, గజయుద్ధాలు, అశ్వయుద్ధాలు, వృషభ యుద్ధాలు మొదలైన వినోదాల్లో యువవీరులు పాల్గొనేవారు. కుంతల సోమేశ్వరుని "అభిలషితార్థ చింతామణి" లో ఇటువంటి క్రీడావిశేషాలు చాల పేర్కొనబడ్డాయి.

ఈ పరిమితవ్యాసంలో మహోజ్జ్వలమైన ఆంధ్ర సంస్కృతిని దిఙ్మాత్రంగానైనా చెప్పడానికి అవకాశం లేదు. కాబట్టి "చరిత్ర–సంస్కృతి" అనే విషయం మీద పరిశ్రమ చేసినవార్ని ఒకమారు స్మరిద్దాము.

## ఆంధ్రదేశ చరిత్రకారులు :

ఆంధ్రదేశచరిత్ర రచించిన మహనీయుల్లో ప్రప్రథమంగా పేర్కొనవలసినవారు చరిత్రచతురానన బిరుదాంచితులు చిలుకూరి వీరభద్రరావుగారు. ఆంధ్రదేశచరిత్రను మూడు సంపుటాలలో వీరు ప్రకటించారు. బహుముఖప్రజ్ఞాధురంధరులు శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారు ఆంధ్రుల చరిత్ర విషయంలో చేసిన కృషి అపారమైంది. వీరు రచించిన గ్రంథాలలో ప్రముఖమైంది "రెడ్డిరాజ్యముల చరిత్ర" (History of Reddi Kingdoms). ఆంధ్రదేశచరిత్ర సంగ్రహం, అమరావతీస్తూపం మొదలయినవి వీరి యితర రచనలు. తెలుగుభాషాసమితివారు ప్రకటించిన తెలుగు విజ్ఞాన సర్వస్వ సంపుటాలలో మూడవదానికి (తెలుగు సంస్కృతి) ముఖ్య సంపాదకులు వీరు. వీరు ప్రకటించిన శాసనాలు, వ్యాసాలు అసంఖ్యాకం. నేలటూరి వేంకటరమణయ్యగారు, నీలకంఠశాస్త్రిగారు, భావరాజు వేంకట కృష్ణారావుగారు, మారేమండ రామారావుగారు మొదలైన విద్వాంసులు అనేకులు ఆంధ్రదేశచరిత్రకు సంబంధించిన వివిధ విషయాలమీద కృషిచేసి, చరిత్ర నిర్మాణానికి సర్వవిధాలా తోడ్పడ్డారు.

దేశచరిత్రరచనలో చూపిన ఉత్సాహం మనవారు సాంస్కృతికచరిత్రరచనలో చూపినట్లు కనబడదు. ఆంధ్రుల సాంఘికచరిత్ర వ్రాసినవారిలో ప్రథములు శ్రీ సురవరము ప్రతాపరెడ్డిగారు. దాన్ని వ్రాయడానికి వారు చేసిన కృషి అత్యపూర్వమైనది. దానికి కేంద్ర సాహిత్య అకాడమీవారి బహుమతికూడా లభించింది. ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనముగారు, ఖండవల్లి బాలేందుశేఖరంగారు కలసి "ఆంధ్రుల చరిత్ర—సంస్కృతి" అనే పేరున ఒక గ్రంథం వ్రాశారు. ఆంధ్ర విశ్వకళాపరిషదుపాధ్యక్షులు రాజా శ్రీ మేకా రంగయ్యప్పారావుగారు ఆంధ్ర సంస్కృతిపై ఒకగ్రంథం వ్రాశారు. ఆంధ్రుల సంస్కృతికి సంబంధించిన ముఖ్య విషయాలన్నీ ఇందులో వివరింపబడ్డాయి. సాంస్కృతిక చరిత్రను వివరించే గ్రంథాలు ఈ మూడే. అప్పుడప్పుడు కొందరు వ్యాసాలు ప్రకటిస్తున్నారు.

ఇక ఆంధ్రవిశ్వకళాపరిషదధ్యాపకులు, పరిశోధకులు, చరిత్ర సంస్కృతుల గురించి చేసిన కృషిని పరిశీలిద్దాం.

# ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పరిశోధనలు

## ఆంధ్రశాఖ

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఆంధ్రశాఖలో ఆంధ్రుల సంస్కృతి గురించి జరిగిన పరిశోధన గురించి క్రింద విశదీకరింపబడుతున్నది. అనగా, సిద్ధాంతవ్యాసము పేరు, పిహెచ్.డి. డిగ్రీ వచ్చిన సంవత్సరము, సిద్ధాంతవ్యాస రచయిత పేరు, పర్యవేక్షకుని పేరు, ఆ వ్యాస విషయము, క్రమముగా క్రింద సూచింపబడుతున్నాయి.

### సిద్ధాంత వ్యాసములు (Ph. D. theses) :

1. 'ఆంధ్ర ప్రబంధము – అవతరణ వికాసములు' (1945)
   రచయిత : డా. కె. వి. ఆర్. నరసింహంగారు
   పర్యవేక్షకులు : ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు

ఈ సిద్ధాంత వ్యాసములో ఆంధ్ర వాఙ్మయమునందు మిక్కిలి ప్రసిద్ధిపొందిన ప్రబంధశాఖయొక్క అవతరణము, వికాసము 28 ప్రకరణములలో వివరింపబడియున్నది. తెలుగులో ఇది మొదటి సిద్ధాంత వ్యాసము. ఆంధ్ర విశ్వవిద్యాలయ ప్రచురణ

2. 'ఆంధ్ర వాఙ్మయముపై ఆంగ్లప్రభావము' (1956)
   రచయిత : డా. కె. వీరభద్రరావుగారు
   పర్యవేక్షకులు : ఆచార్య జి. జె. సోమయాజులుగారు

17వ శతాబ్దినుండి 20వ శతాబ్దమువరకు ఆంధ్రభాషా వాఙ్మయములమీద ఆంగ్లమునకున్న ప్రభావాన్ని ఈ సిద్ధాంతవ్యాసము వివరిస్తున్నది. ముద్రితము.

3. 'ప్రాచీనాంధ్ర శాసనములు' (1956)
   రచయిత : డా. టి. వి. నారాయణశాస్త్రిగారు
   పర్యవేక్షకులు : ఆచార్య జి. జె. సోమయాజులుగారు

రేనాటి చోళుల దగ్గరనుండి ఉన్న ప్రాచీన శాసనాలు పరిశోధించి అందులో వృత్తగ్రంథులున్నాయని శ్రీ నారాయణశాస్త్రిగారు నిరూపించినారు.

4. 'ఆంధ్ర యక్షగాన వాఙ్మయ చరిత్ర' (1957)
రచయిత : డా. యస్వీ. జోగారావుగారు
పర్యవేక్షకులు : ఆచార్య జి. జె. సోమయాజులుగారు

ఇందులో యక్షగానముయొక్క పుట్టుపూర్వోత్తరాలు – దాని అభివృద్ధి వివరింపబడ్డాయి. ఇంచుమించుగా 500 యక్షగానాలు పరిశోధింపబడ్డవి. ఆంధ్ర విశ్వవిద్యాలయ ప్రచురణ.

5. 'పోతన – అతని గ్రంథములు' (1961)
రచయిత్రి : డా. వి. రాజేశ్వరిగారు
పర్యవేక్షకులు : ఆచార్య కె. వి. ఆర్. నరసింహంగారు

పోతన గ్రంథములను గురించి సమగ్రమైన పరిశీలన ఇందులో జరిగింది.

6. 'తెలుగులో స్థలపురాణములు' (1962)
రచయిత : డా. వి. జి. కృష్ణమాచార్యులుగారు
పర్యవేక్షకులు : ఆచార్య జి. జె. సోమయాజులుగారు

రెండు భాగములలో తెలుగులో ఉన్న స్థల పురాణముల గురించి చర్చింపబడినది.

7. 'ఆంధ్ర సాహిత్యములోని సామెతలు, నుడికారములు – సేకరణ – వివరణ' (1963)
రచయిత : డా. సి. సుబ్రహ్మణ్యశాస్త్రిగారు
పర్యవేక్షకులు : ఆచార్య కె. వి. ఆర్. నరసింహంగారు

ఆంధ్ర సారస్వత ప్రారంభంనుండి 18వ శతాబ్ది అంతమువరకు ఆంధ్ర వాఙ్మయంలో ఉన్నటువంటి సామెతలు, నుడికారములు సేకరించి ఈ రచయిత వివరించి యున్నారు.

8. 'తెలుగు క్రియారూప నిర్మాణము – తులనాత్మక పరిశీలనము' (1964)
రచయిత : డా. పి. యస్. సుబ్రహ్మణ్యంగారు
పర్యవేక్షకులు : ఆచార్య జి. జె. సోమయాజులుగారు

తెలుగునందలి క్రియాపదముల రూపనిర్మాణమును తక్కిన ద్రావిడభాషల సామగ్రితో తులనాత్మకముగ సమీక్షించిన సిద్ధాంత వ్యాసము.

9. 'ఛందశ్శాస్త్రము – అవతరణ వికాసములు' (1965)
రచయిత : డా. ఎం. వి. సత్యనారాయణగారు
పర్యవేక్షకులు : ఆచార్య కె. వి. ఆర్. నరసింహంగారు

ఈ సిద్ధాంత వ్యాసంలో 16 భాగాలుకలవు. పింగళిచ్ఛందస్సు మొదలైన వాటి దగ్గర్నుంచి ఆంధ్రలో అప్పకవీయాదులవరకు ఛందశ్శాస్త్రం ఏవిధంగా అభివృద్ధి చెందిందో దానిమీద కర్ణాట తమిళ భాషా ఛందోరీతుల ప్రభావం ఎటువంటిదో ఇందులో సమగ్రంగా వివరింపబడింది.

10. 'ప్రాఙ్నన్నయ యుగ ఆంధ్ర శాసన భాష చారిత్రక వ్యాకరణము' (1965)
రచయిత : డా. బూదరాజు రాధాకృష్ణగారు

నన్నయకు సమకాలికములును పూర్వకాలికములు నయిన సర్వాంధ్ర భాషా శాసనములలోని భాషా స్వరూపమును చారిత్రక పద్ధతిలో నిరూపించిన సిద్ధాంత వ్యాసము.

11. 'శ్రీనాథుడు – చారిత్రకము – ఆంధ్రీకరణము' (1965)
రచయిత : డా. కె. శ్రీరామమూర్తిగారు
పర్యవేక్షకులు : ఆచార్య కె. వి. ఆర్. నరసింహంగారు

శ్రీనాథుని జీవితం గురించి, ఆ మహాకవి గ్రంథాల గురించి ఇందులో సమగ్రమైన పరిశోధన ఉన్నది.

12. 'ఆంధ్ర వ్యాకరణము – అవతరణ వికాసములు' (1966)
రచయిత : డా. బి. పురుషోత్తంగారు
పర్యవేక్షకులు : ఆచార్య జి. జె. సోమయాజులుగారు

ఆంధ్రలో ఉన్నటువంటి వ్యాకరణము లన్నింటి యొక్క సమగ్ర పరిశోధన యిది.

13. 'తెనుగు నందలి వైకృత పదముల స్వరూప నిరూపణము' (1966)
రచయిత : డా. టి. దొణప్పగారు
పర్యవేక్షకులు : ఆచార్య జి. జె. సోమయాజులుగారు

తెనుగు నందలి సంస్కృతభవ, ప్రాకృతసమ, ప్రాకృతభవముల సంపూర్ణ చరిత్రము, ధ్వనివిజ్ఞానము, రూపవిజ్ఞానము, అర్థవిపరిణామము, అను విభాగముల క్రింద ప్రమాణోపపత్తి సంకలితముగ సమ్యగ్వీక్షణము గావించిన సిద్ధాంత వ్యాసము.

14. 'నాచన సోమనాథుడు – అతని రచనలు' (1966)
రచయిత : డా. వి. కామేశ్వరరావుగారు
పర్యవేక్షకులు : ఆచార్య కె. వి. ఆర్. నరసింహంగారు

నాచన సోమనాథుని ఉత్తర హరివంశమును గూర్చి సమగ్ర పరిశోధన యిది.

15. 'ఆంధ్ర శాసన సారస్వతము లందలి ఉర్దూ మరాఠీ పదములు (క్రీ.శ. 1800 వఱకు)' (1967)
రచయిత : డా. ఎల్. చక్రధరరావుగారు
పర్యవేక్షకులు : ఆచార్య కె. వి. ఆర్. నరసింహంగారు

ఆంధ్ర సాహిత్యము నందును, తెలుగు శాసనము లందును ప్రయుక్తమైన ఉర్దూ, మరాఠీ, ఒరియా భాషా పదముల చరిత్రము వివిధ కోణముల నుండి పరిశీలించిన సిద్ధాంత వ్యాసము.

16. 'తెనాలి రామకృష్ణుని గ్రంథములు' (1967)
రచయిత : డా. ఇ. కృష్ణమాచార్యులుగారు
పర్యవేక్షకులు : ఆచార్య కె. వి. ఆర్. నరసింహంగారు

తెనాలి రామకృష్ణుని పాండురంగ మాహాత్మ్యం గూర్చి సంపూర్ణ పరిశోధన యిది.

17. 'నన్నెచోడుని కుమార సంభవము' (1967)
రచయిత్రి : డా. టి. నిర్మలగారు
పర్యవేక్షకులు : ఆచార్య కె. వి. ఆర్. నరసింహంగారు

నన్నెచోడుని కుమార సంభవం గురించి యిది సమగ్ర పరిశోధన.

18. 'తెలుగులో ఉత్తర రామాయణములు' (1968)
రచయిత : డా. ఎం. పాండురంగారావుగారు
పర్యవేక్షకులు : ఆచార్య కె. వి. ఆర్. నరసింహంగారు

తిక్కన, కాచవిభుడు విఠలరాజు, కంకంటి పాపరాజు రచించిన ఉత్తర రామాయణముల సమగ్ర సమీక్ష యిది.

19. 'పాల్కురికి సోమనాథుఁడు – అతని గ్రంథములు' (1969)
రచయిత : డా. పి. వీరేశలింగంగారు
పర్యవేక్షకులు : ఆచార్య కె. వి. ఆర్. నరసింహంగారు

వీరశైవ రచయితలలో అగ్రగణ్యుకైన పాల్కురికి సోమనాథుని గ్రంథము లన్ని యిందులో పరిశీలింపబడ్డవి.

20. 'కరుణ రసము–ఆంధ్ర వాఙ్మయము' (1970)
రచయిత : డా. ఎన్. రాధాకృష్ణగారు
పర్యవేక్షకులు : ఆచార్య కె. వి. ఆర్. నరసింహంగారు

ఆంధ్ర వాఙ్మయములో కరుణరస పోషణ ఏయే గ్రంథాలలో ఏయే విధంగా ఉందో, ఇందులో విశదీకరింపబడి యున్నది.

21. 'ఆంధ్ర వాఙ్మయము – రామాయణము' (1971)
రచయిత్రి : డా. ఎ. మలయవాసినిగారు
పర్యవేక్షకులు : డా. కె. శ్రీరామమూర్తిగారు

ఆంధ్ర వాఙ్మయములో వెలసిన రామాయణము లన్నింటి గూర్చి చేయబడిన సమగ్ర పరిశోధన యిది.

22. 'ఆంధ్ర వాఙ్మయముపై గాంధీతత్త్వ ప్రభావము' (1973)
రచయిత : డా. వి. అంకయ్యగారు
పర్యవేక్షకులు : ఆచార్య కె. వి. ఆర్. నరసింహంగారు

ఇందులో జాతీయోద్యమము, గాంధీతత్త్వము, ఆంధ్ర కవిత్వముపై దాని ప్రభావము వివరింపబడినవి.

23. 'ఆంధ్ర వాఙ్మయము–చారిత్రక కావ్యములు' (1974)
రచయిత్రి : డా. బి. అరుణకుమారిగారు
పర్యవేక్షకులు : ఆచార్య కె. వి. ఆర్. నరసింహంగారు
ఇది ఆంధ్ర వాఙ్మయంలోని చారిత్రక కావ్యముల సమగ్ర పరిశోధన.

24. 'మహా భారతము–ఉపాఖ్యాన తత్త్వము' (1975)
రచయిత : డా. పి. వెంకటరాజుగారు
పర్యవేక్షకులు : ఆచార్య కె. వి. ఆర్. నరసింహంగారు

మహాభారతంలోగల వివిధ ఉపాఖ్యానము లందలి తత్త్వము ఈ సిద్ధాంత వ్యాసములో సప్రమాణముగా నిరూపింపబడినది.

25. 'మెకంజీ కైఫీయత్తులలోని అన్య దేశీయ శబ్దములు' (1970)
రచయిత : డా. రాళ్లబండి శ్రీరామశాస్త్రిగారు
పర్యవేక్షకులు : ఆచార్య టి. దొణప్పగారు

మెకంజీ సంకలనము లను పేర ప్రశస్తి ప్రచారముల నందిన స్థానిక వృత్తాంతముల (local records) లో ప్రయోగింపబడిన ఉర్దూ, మరాఠీ మున్నగు అన్య దేశీయ శబ్దముల స్వరూప స్వభావాలను సమ్యక్ప్రదర్శనము గావించిన సిద్ధాంత వ్యాసము.

26. 'తెలుగులో కవితా విప్లవ స్వరూపము' (1974)
రచయిత : డా. వెల్చేరు నారాయణరావుగారు
పర్యవేక్షకులు : ఆచార్య టి. దొణప్పగారు

వేయేండ్ల తెలుగు సాహిత్యములో ఆయాయుగాలలో కవితా వస్తువు విషయముగా ఛందఃపరముగ ప్రవర్తితమైన విప్లవధోరణులను ప్రాక్ప్రతీచీ విమర్శనాధారతో

వివరింపబడి ప్రప్రథమముగా శిష్ట వ్యావహారిక భాషలో సంగ్రథితమైన సిద్ధాంత వ్యాసము.

27. 'ధూర్జటి రచనలు—సమగ్ర పరిశీలనము' (1974)
రచయిత : డా. గోరంట్ల మదనమోహనరావుగారు

ధూర్జటి జీవితాదికములు, అతని వంశవృక్షము, రచనలు, వానిమూలములు, కవితాసౌందర్యము, పాత్రపోషణము, భాషావైశిష్ట్యము, క్షేత్ర మాహాత్మ్యములలో కాళహస్తి మాహాత్మ్యమునకు గల స్థానము, మున్నగు నంశములు సమీక్షింపబడిన సిద్ధాంతవ్యాసము.

ఆచార్య టి. దొణప్ప, ఆచార్య కె. వి. ఆర్. నరసింహం, డా. సి. సుబ్రహ్మణ్య శాస్త్రి, డా. యల్. చక్రధరరావుగార్ల పర్యవేక్షణలో ఈ యాంధ్ర శాఖలో పలువురు భాషా వాఙ్మయములపై పరిశోధన చేయుచున్నారు. అనుబంధ కళాశాలలలో పనిచేయుచున్న ఆంధ్రోపన్యాసకులుకూడ పరిశోధన చేయుచున్నారు. గ్రంథ విస్తర భీతిచే వారిని గూర్చి యిట వ్రాయలేదు.

పి. జి. సెంటరు గుంటూరులో ఆచార్య యస్వీ. జోగారావుగారు, డాక్టరు కె. శ్రీరామమూర్తిగారు పర్యవేక్షకులుగా నుండి ఆంధ్ర సారస్వతములోని కొన్ని ముఖ్య విషయములపై పరిశోధన చేయించుచున్నారు. కాలవ్యవధి లేనందువలన, అచ్చటి సిద్ధాంత వ్యాసముల విషయసేకరణ చేయలేక పోయినందువలన ఇందులో చేర్చలేదు.

## ఆంధ్రుల సంస్కృతి గురించి వ్రాసిన ప్రత్యేక గ్రంథములు :

1. దక్షిణాంధ్ర వాఙ్మయ చరిత్ర (మొదటి భాగము ముద్రితము, 1951)
రచయిత : ఆచార్య కె. వి. ఆర్. నరసింహంగారు

తంజావూరు, మధుర, పుదుక్కోట రాజ్యాలలో నాయకరాజులు పరిపాలించి, ఆంధ్ర సంస్కృతిని, ఆంధ్ర సాహిత్యమును అనేక విధాల పోషించేరు. ఈ గ్రంథంలో తంజావూరు నాయకరాజుల సారస్వతసేవ సమగ్రంగా వివరింపబడినది.

2. సాహితీ సమీక్ష
రచయిత : ఆచార్య కె. వి. ఆర్. నరసింహంగారు

ఇది సారస్వత వ్యాసముల సంపుటి. శ్రీనాథుడు మొదలైన ప్రాచీన కవుల గ్రంథాలేకాక అత్యాధునికులైన గురజాడవారి కావ్యములుకూడ ఇందులో సమీక్షింపబడియున్నవి. ఆంధ్ర విశ్వవిద్యాలయ ప్రచురణ.

3. సంస్థానములు — సాహిత్య పోషణము
రచయిత : ఆచార్య తూమాటి దొణప్పగారు

ఆంధ్ర వాఙ్మయాభివృద్ధికి సంస్థానాధీశ్వరులు ఏవిధంగా దోహదంచేశారో వారి యాస్థానాల్లో ఏయే కవులు ప్రసిద్ధులై కావ్య రచన సాగించారో, యీ గ్రంథంలో సమగ్రంగా వివరింపబడి యున్నది. దీనికి ఆంధ్ర సాహిత్య అకాడమీవారి బహుమతి లభించినది. ఈ గ్రంథాన్ని ఆంధ్ర విశ్వవిద్యాలయమువారు ప్రచురించిరి.

4. భాషా చారిత్రక వ్యాసావళి

రచయిత : ఆచార్య తూమాటి దొణప్పగారు

భాషా చరిత్రకు సంబంధించిన వివిధ వ్యాసములు ఇందులో గలవు.

1. నన్నయ—అన్యదేశ్యాభాసములు
2. శ్రీనాథ యుగము—అన్యదేశ్యములు
3. ఆంధ్రభాష—హకారాది పదములు
4. తెలుగులో బుడతకీచు నుడులు
5. మరాఠీలోని తెలుగు నుడులు
6. తెలుగు నందలి కృతక ప్రామాణిక రూపములు

అను వ్యాసములు ఆచార్య దొణప్పగారి పరిశోధనా పాటవాన్ని ప్రకటిస్తున్నాయి.

5. తెలుగులో వెలుగులు

రచయిత : ఆచార్య తూమాటి దొణప్పగారు

1954 వ సంవత్సరంనుండి డా. దొణప్పగారు చేసిన రేడియో ప్రసంగాలలో 20 ప్రసంగాలు ఇందులో ప్రకటింపబడినవి. తొలి 6 ప్రసంగాలు శిష్టసాహిత్యానికి, తరువాతి 6 ప్రసంగాలు జానపద సాహిత్యానికి, తక్కిన 8 ప్రసంగాలు భాషా విజ్ఞానానికి సంబంధించినవి.

6. జానపద కళాసంపద

రచయిత : ఆచార్య తూమాటి దొణప్పగారు

ఆంధ్రుల సంస్కృతికి జానపద సాహిత్యం దర్పణం వంటిది. డా. దొణప్ప గారు ముప్పదేండ్లుగా ఈ సాహిత్యంలో కృషిచేస్తున్నారు. ఆ కృషి ఫలితమే యీ గ్రంథం.

## తత్త్వశాఖ

ప్రచురణలు :

1. నాగార్జునుడు

రచయిత : ఆచార్య కె. సచ్చిదానందమూర్తిగారు

ప్రచురణ : నేషనల్ బుక్ట్రస్ట్, ఢిల్లీ.

ఈ గ్రంథములో బౌద్ధాచార్యులలో ప్రసిద్ధుడును, మహాయాన ప్రవక్తయు అయిన నాగార్జునుని గూర్చి సమగ్రముగా వివరింపబడినది.

## సంస్కృత శాఖ

**గ్రంథములు :**

ఆంధ్రులు–సంస్కృత వాఙ్మయము
రచయిత : డా. పి. శ్రీరామమూర్తిగారు

ఆంధ్రులు సంస్కృతభాషలో రచించిన గ్రంథాలగురించి యిందులో వివరింపబడ్డది.

## మానవశాస్త్ర శాఖ

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో మానవశాస్త్ర శాఖ (Anthropology Department) ద్వారా "ఆంధ్రుల చరిత్ర – సంస్కృతి" – అను అంశములపై జరుగుచున్న కృషి :

డా. కె. తిమ్మారెడ్డి, శ్రీ బి. సుదర్శన్, కుమారి నసీమ్‌ఖియాస్ మొదలగు వారు ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతములలో జరిపిన పరిశోధనల వలన ఆంధ్రదేశ చరిత్ర పూర్వయుగపు సంస్కృతి తెలియుచున్నది.

భారతదేశములో అంతకు పూర్వము లభించని ఉత్తర ప్రాచీన శిలాయుగ సంస్కృతి, కర్నూలు జిల్లాలోని బేతంచెర్ల వద్ద త్రవ్వుట వలన వ్యక్తమగుచున్నది.

విశాఖపట్టణ సమీపమున నున్న మధురవాడ వద్ద త్రవ్వుటవలన ఆ ప్రాంతపు వ్యవసాయదారుల సంస్కృతి తెలియుచున్నది.

కర్నూలు, కడప, నెల్లూరు, విశాఖపట్టణం జిల్లాలలో భూమిపై నున్నవాని వలనను, త్రవ్వుటవలనను, లోహయుగమునకు పూర్వపు శిలాయుగ సంస్కృతులు క్రిందిని పేర్కొనుచున్న వానివలన తెలియుచున్నవి :

(1) పూర్వపు ప్రాచీన శిలాయుగము నాటి చేతి గొడ్డళ్లు, గులకరాతి పనిముట్లు, క్లీవర్లు, గోకుడురాళ్లు లభించినవి.

(2) మధ్యప్రాచీన శిలాయుగము నాటి పలురకములైన గోకుడురాళ్లు, మొనలు, బోరర్లు దొరికినవి.

(3) ఉత్తరప్రాచీన శిలాయుగము నాటి బ్లేడ్లు, బ్యూరిన్లు, వాటితోపాటు ఎముకతో చేసిన గోకుడురాళ్లు, మొనలు, ఉలి కొనవంటి పరికరములు లభించినవి.

(4) మధ్య శిలాయుగమునాటి మిక్కిలి చిన్న పనిముట్లు విరివిగా దొరికినవి.

(5) నవీన శిలాయుగమునాటి నునుపురాతితో చేసిన గొడ్డళ్లు, బడిసెలు, ఉలులు దొరికినవి. మరియు నిత్యోపయోగకరములైన కుండలు, వస్తువులు నిలువ

చేసుకొనే కుండలు, గుడిసెలవంటి కట్టడములు కానవచ్చినవి. వీని వలన వ్యావసాయక సంఘముల ప్రారంభ దశ, సంస్కృతి విశదమగుచున్నది.

## చరిత్ర శాఖ

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో చరిత్రశాఖ ద్వారా "ఆంధ్రుల చరిత్ర — సంస్కృతి" అను అంశములపై జరుగుచున్న కృషి :

### 1. ఆంధ్రుల చరిత్ర :

1. శ్రీ మల్లంపల్లి సోమశేఖర శర్మగారు
   - (అ) ఆంధ్రదేశ చరిత్ర సంగ్రహము
   - (ఆ) తెలుగు సంస్కృతి (తెలుగు విజ్ఞాన సర్వస్వము — 3 వ సంపుటమునకు ముఖ్య సంపాదకులు)
   - (ఇ) చారిత్రాత్మక వ్యాసములు
2. శ్రీ సి. సోమసుందరరావుగారు
   - (అ) ఆంధ్ర చరిత్ర (క్రీ.శ. 1336 వరకు ఆంగ్లంలో రచింపబడు చున్నది)
   - (ఆ) ఆంధ్ర రాజవంశ చరిత్ర (క్రీ.శ. 16 వ శతాబ్దము వరకు) (వ్యాసము — 'South Indian Studies' లో అచ్చులో నున్నది)
3. డా. ఇ. సూర్యనారాయణ మూర్తిగారు
   ఆంధ్ర చరిత్రలో చారిత్రక పద్ధతి
4. శ్రీ బి. ఎస్. ఎల్. హనుమంతరావుగారు
   - (అ) ఆంధ్రుల చరిత్ర
   - (ఆ) ఆంధ్ర దేశములోని మతములు

### (a) శాతవాహనులు, తరువాతివారు :

1. శ్రీ గొర్తి వెంకట్రావుగారు
   శాతవాహనుల చరిత్ర ('దక్కను ప్రాచీన చరిత్ర' లోని భాగములు)
2. శ్రీ రాయప్రోలు సుబ్రహ్మణ్యంగారు
   - (అ) విష్ణుకుండి విక్రమేంద్రవర్మ తుండి శాసనము
   - (ఆ) ఇక్ష్వాకు నాణెములు
3. ఆచార్య ఓరుగంటి రామచంద్రయ్యగారు
   - (అ) ఆంధ్ర శాతవాహన కాల నిర్ణయము (జదునాథ్ సర్కార్ సంపుటము)

(ఆ) "శాతవాహనులు, తరువాతి వంశములు — వంశక్రమ, కాల నిర్ణయ సమస్యలు" (స్టేట్ ఆర్కైవ్స్, హైదరాబాదు వారు ప్రచురిస్తున్నారు, అచ్చులో నున్నది)
(ఇ) విష్ణుకుండినులు — వారి వంశక్రమము, కాల నిర్ణయము (ఇతిహాస్, 1 వ సంపుటము)
(ఈ) హాలుడు (Journal of Indian History)
(ఉ) ఆంధ్రశ్రీ

4. డా. ఇ. సూర్యనారాయణ మూర్తిగారు
(అ) శాతవాహనానంతరీకులు (ప్రపంచ తెలుగు మహాసభలు — అచ్చులో నున్నది)
(ఆ) అపర మహావినశేలీయ
(ఇ) అపరాంత (తెలుగు రచయితల సంఘము, హైదరాబాదు)

5. శ్రీ సి. సోమసుందరరావుగారు
(అ) శాతవాహన రాజ్యస్థాపన కాలము — నాణెముల యాధారము (Journal of Numismatic Society of India)
(ఆ) గౌతమీపుత్ర శాతకర్ణి (పీహెచ్.డి. సిద్ధాంత వ్యాసము—తయారగుచున్నది)

6. శ్రీ కె. ఆర్. సుబ్రహ్మణ్యంగారు
ఆంధ్ర దేశములోని ప్రాచీన బౌద్ధావశేషాలు

7. శ్రీ మల్లంపల్లి సోమశేఖర శర్మగారు
అమరావతీ స్తూపము

(b) కాకతీయులు—రెడ్లు :

1. శ్రీ మల్లంపల్లి సోమశేఖర శర్మగారు,
శ్రీ నేలటూరి వెంకట రమణయ్యగారు
కాకతీయుల చరిత్ర ('దక్కను ప్రాచీన చరిత్ర' లోని భాగములు)

2. శ్రీ మల్లంపల్లి సోమశేఖర శర్మగారు
(అ) 'ఆంధ్ర చరిత్రలో మరుగుపడిన ఒక అధ్యాయము' (A Forgotten Chapter of Andhra History)
(ఆ) రెడ్డి రాజ్యముల చరిత్ర

3. శ్రీమతి ప్రతిభ చిన్నప్ప
కాకతీయ రుద్రదేవి (పీహెచ్.డి. సిద్ధాంత శీర్షిక)

(c) విజయనగర రాజులు — గజపతులు :

1. శ్రీ గొర్తి వెంకటరావుగారు
విజయనగర చరిత్ర (Comprehensive History of India, 5 వ సంపుటములోని భాగములు)

2. శ్రీ రాయప్రోలు సుబ్రహ్మణ్యంగారు
(అ) విజయనగర చరిత్ర (దక్కను మధ్యయుగ చరిత్రలోని భాగములు)
(ఆ) ఒరిస్సా సూర్యవంశ గజపతులు (పీహెచ్.డి. సిద్ధాంత వ్యాసము)

3. ఆచార్య ఓరుగంటి రామచంద్రయ్యగారు
(అ) విజయనగర కృష్ణదేవరాయల మీద పరిశోధన (పీహెచ్.డి. సిద్ధాంత వ్యాసము)
(ఆ) విజయనగర చరిత్ర (క్రీ.శ. 1542 నుండి Karnataka through the Ages)

4. ఆచార్య ఓరుగంటి రామచంద్రయ్యగారు
శ్రీ సి. సోమసుందరరావుగారు
(అ) బరడాస్ కథనములోని 'బయను' (Journal of Indian History, 1965)

5. డా. కె. సుందరంగారు
(అ) మధ్యయుగమున ఆంధ్రదేశములోని ఆర్థిక సాంఘిక పరిస్థితులు (ఎమ్.ఏ. ఆనర్స్ సిద్ధాంత వ్యాసము)

6. డా. వై. శ్రీరామమూర్తిగారు
(అ) విజయనగర సామ్రాజ్యంలోని మూడు ప్రముఖ సామంత వంశములు (ఎమ్.ఏ. ఆనర్స్ సిద్ధాంత వ్యాసము)
(ఆ) విజయనగర కాలమునాటి తెలుగుదేశ చరిత్రలో పరిశీలన (పీహెచ్.డి. సిద్ధాంత వ్యాసము)
(ఇ) విజయనగర చరిత్రపై నూతన పరిశోధన
(ఈ) ఉదయగిరి రాజ్య రాజకీయ చరిత్ర
(ఉ) పెమ్మసాని వంశచరిత్ర
(ఊ) తిరుమలరాయలు పెనుగొండకు రాజధాని మార్చుట
(ఋ) రాక్షసి తంగడి యుద్ధము, అటు తరువాత.

7. డా. ఇ. సూర్యనారాయణమూర్తిగారు
(అ) ఇబన్‌బతూతా (ఆంధ్ర రచయితల సంఘము, హైదరాబాద్)

8. శ్రీ సి. సోమసుందరరావుగారు
   (అ) విజయనగర చరిత్ర (క్రీ.శ. 1565 తరువాత) (ఎమ్.ఏ. ఆనర్స్ సిద్ధాంత వ్యాసము)

(d) ఆధునికయుగము :

1. డా. కె. సుందరంగారు
   (అ) విశాఖపట్టణము జిల్లా చరిత్ర (విశాఖపట్టణం జిల్లా గెజిటీరు)
   (అ) ఆంధ్ర చరిత్రలో ఆధునికయుగము (ఆంధ్రప్రదేశ్ గెజిటీరు : అచ్చులో నున్నది)
2. డా. వై. శ్రీరామమూర్తిగారు
   (అ) ఆధునిక ఆంధ్రప్రదేశ్ చరిత్రకు ఆధారములు.
3. డా. ఐ. సూర్యనారాయణమూర్తిగారు
   (అ) పద్మనాభ యుద్ధము.

II. పురాతత్త్వశాస్త్రము :

1. శ్రీ రాయప్రోలు సుబ్రహ్మణ్యంగారు
   (అ) శాలిహుండాం (ఆంధ్రప్రదేశ్ పురాతత్త్వశాఖవారు ప్రచురించిరి)
2. శ్రీ బి. ఆర్. సుబ్రహ్మణ్యంగారు
   (అ) జామిత్రవ్యకాలు (అచ్చులోనున్నది)

III. శాసనములు :

1. శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారు
   (అ) శాలంకాయన, పల్లవ, విష్ణుకుండి, తూర్పు చాళుక్య, రెడ్డి, విజయనగర శాసనములు (ఆంధ్రపత్రిక – ఉగాది సంచిక లోను, 'భారతి' లోను ప్రచురింపబడినవి)
   (అ) తెలంగాణా జిల్లాలోని శాసనములు 4వ సంపుటము (ఇంగ్లీషు)– సంపాదకత్వము
2. ఆచార్య ఓరుగంటి రామచంద్రయ్యగారు
   శ్రీ సి. సోమసుందరరావుగారు
   (అ) తూర్పు గాంగ అనంతవర్మ ముంజేరు తామ్ర శాసనము (ఆచార్య నీలకంఠశాస్త్రి అశీతిపూర్తి సందర్భముగా వెలువడిన సంపుటములోని వ్యాసము–ఇంగ్లీషు)

3. శ్రీ సి. సోమసుందరరావుగారు
శ్రీమతి ప్రతిభ చిన్నప్పగారు
(అ) కాకతి వీరరుద్రుని ఉత్తరేశ్వర తామ్రశాసనము (ఆంధ్రేతిహాస పరిశోధక మండలి పత్రిక (తెలుగు) (అచ్చులోనున్నది)

4. శ్రీ సి. సోమసుందరరావుగారు
(అ) గాంగ మూడవ వజ్రహస్తుని నందబలగ తామ్ర శాసనము (ఎపిగ్రాఫియా ఆంధ్రికా) (ఇంగ్లీషు) (అచ్చులోనున్నది)

## IV. సంస్కృతి–కళ

1. డా. కె. సుందరంగారు
(అ) సింహాచల దేవాలయము (పీహెచ్.డి. సిద్ధాంత వ్యాసము)

2. శ్రీ బి. మస్తానయ్య
(అ) ముఖలింగ దేవాలయములు (పీహెచ్.డి. సిద్ధాంత వ్యాసము–సమర్పించుటకు సిద్ధముగా నున్నది)

## హిందీ శాఖ

సాహిత్యాచార్య ప్రొఫెసరు జి. సుందరరెడ్డిగారి అవిరళకృషి ఫలితముగా 1965లో ఆంధ్ర విశ్వవిద్యాలయములో హిందీ భాషాసాహిత్యముల అధ్యయన, పరిశోధనల స్నాతకోత్తరశాఖ (Department of Postgraduate Studies and Research in Hindi) ప్రారంభమైనది. ఈ శాఖద్వారా హిందీభాషాసాహిత్యాల అధ్యయనముతోపాటు హిందీ – తెలుగు సాహిత్యముల తులనాత్మక పరిశోధన ఇతోధికముగా జరుగుచున్నది. హిందీ – తెలుగు సాహిత్యముల సమానంతర ప్రక్రియలను, విశేషాలను తెలిసికొనుటకు ఈ విధమైన తులనాత్మక పరిశోధన ఎంతగానో తోడ్పడుతుంది. ఏ విషయమునయినను సరిగా అవగాహన చేసికొనుటకు మాతృభాషాపరిజ్ఞానము ఎంతో అవసరము.

హిందీశాఖ ప్రారంభమై కేవల మొక దశాబ్దమే అయినను ప్రొఫెసర్ జి. సుందరరెడ్డిగారి పర్యవేక్షణలో ఇంతవరకు 12 గురు పరిశోధకులకు పీహెచ్.డి. డిగ్రీలు లభించాయి. వీరిలో 10 మంది హిందీ – తెలుగు సాహిత్యములలో తులనాత్మక పరిశోధన చేశారు. ఇద్దఱు మాత్రము కేవలము హిందీలోనే పరిశోధన చేసిరి. హిందీశాఖలో పరిశోధన చేయువారందరు తమ సిద్ధాంత వ్యాసములను హిందీలోనే వ్రాయుదురు. పీహెచ్.డి. డిగ్రీ పొందినవారి వివరణ పట్టిక క్రింద చూపబడినది.

| క్రమ సంఖ్య | సిద్ధాంత శీర్షిక | పరిశోధకుని పేరు | డిగ్రీ పొందిన సంవత్సరం |
|---|---|---|---|
| 1. | హిందీ – తెలుగు నవలల తులనాత్మక పరిశోధన | డా. జి. బి. సుబ్రహ్మణ్యం | 1970 |
| 2. | హిందీ – తెలుగు నీతికావ్యముల తులనాత్మక పరిశోధన | డా. కె. శివసత్యనారాయణ | 1970 |
| 3. | సూర్‌సాగర్‌లోని ప్రతీక (కేవలము హిందీ-1972 లో ప్రచురింపబడినది) | డా. లక్ష్మయ్యశెట్టి | 1971 |
| 4. | తులసీదాసు – త్యాగరాజు భక్తిపద్ధతుల తులనాత్మక పరిశోధన | డా. టి. సుభద్ర | 1972 |
| 5. | సుమిత్రానందపంత్ – దేవులపల్లి కృష్ణశాస్త్రి కావ్యాల తులనాత్మక అధ్యయనము | డా. పి. అప్పలరాజు | 1972 |
| 6. | విద్యాపతి క్షేత్రయ్య తులనాత్మక పరిశోధన | డా. పి. వి. ఆర్. సూర్యనారాయణ | 1972 |
| 7. | సుమిత్రానందపంత్ కావ్యాలలో సౌందర్యము (కేవలము హిందీ) | డా. ఎ. శ్రీరామరెడ్డి | 1973 |
| 8. | ప్రేమ్‌చంద్ – గోపీచంద్ తులనాత్మక పరిశోధన | డా. వి. సత్యనారాయణ | 1974 |
| 9. | తులసీరామాయణము – రామాయణ కల్పవృక్షము తులనాత్మక పరిశోధన | డా. పి. వి. ఆచార్య | 1974 |
| 10. | జయశంకర్ ప్రసాద్ – విశ్వనాథ సత్యనారాయణ తులనాత్మక పరిశోధన | డా. జి. సుబ్బారావు | 1964 |
| 11. | సూర్‌దాస్ – పోతనల భక్తిపద్ధతి తులనాత్మక పరిశోధన | డా. పి. కమలాదేవి | 1974 |
| 12. | హిందీ – తెలుగు నవలాసాహిత్యాభివృద్ధికి మహిళల కృషి | కె. లీలావతి | 1975 |

ప్రస్తుతము హిందీశాఖలో ఆచార్య జి. సుందరరెడ్డి, డా. కె. రాజశేషగిరిరావు, డా. యస్. వి. మాధవరావు, డా. పి. ఆదేశ్వరరావు, డా. పి. అప్పలరాజుగార్ల పర్యవేక్షణలో వివిధ విషయములపై ముప్పయిఏడుగురు పరిశోధన చేయుచున్నారు. వారిలో పద్నాలుగురు అనుబంధ కళాశాలల హిందీ అధ్యాపకులు, ఇరవైముగ్గురు నియమిత పరిశోధకులు.